క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు



ఆకేపాటి అమర్‌నాథరెడ్డి | కొరముట్ల శ్రీనివాసులు | గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాజంపేట టౌన్ : జిల్లాలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. స్వార్థ, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ఉద్దేశమన్నారు. అన్ని గుణాల కంటే దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమని, పండుగను పురస్కరించుకొని ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారాన్ని వితరణగా ఇవ్వడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. ముస్లింలందరూ హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని ఆకేపాటి ఆకాంక్షించారు. బక్రీద్ పండుగను స్ఫూర్తిగా తీసుకొని సమైక్యతను, సమానత్వాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

వైభవంగా ధ్వజారోహణం

పెనగలూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జరిగిన ధ్వజారోహణంలో ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, పలువురు భక్తులు పాల్గొన్నారు. రాత్రికి హరికథ, నేడు శనివారం వేకువజామున వేణుగోపాలస్వామి, రుక్మిణీ సత్యభామల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు శనివారం నాయుడు సంఘం ఆధ్వర్యంలో శేషవాహన సేవ జరగనున్నట్టు కార్యనిర్వాహకులు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని యానాది పల్లె అరుంధతివాడలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త నగిరిపాటి సుబ్బరాయుడు ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



పూజ కోసం పుట్టమన్ను తీసుకువస్తున్న దృశ్యం

నందలూరు : మండలంలోని అరవపల్లిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శ్రీ కోదండ రామస్వామి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత వైభవంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సరసా రవి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త గంప సుధాకర్ మాట్లాడుతూ శనివారం ప్రత్యేక పూజలు, ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంతో పాటు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ భక్తవత్సలం

సంబేపల్లె : బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గోవధ చేయకూడదన్నారు. ఎవరైనా పశువులను తరలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సామరస్య పూర్వకంగా పండుగ జరుపుకోవాలన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో విద్యార్థి ప్రతిభ

రాయచోటి టౌన్ : ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాలలో రాయచోటి మండలం గరుగుపల్లె విద్యార్థి పల్లపు విజయ్‌కుమార్ జిల్లా స్థాయిలో 12వ ర్యాంక్ సాధించినట్లు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పి.నాగప్రభ తెలిపారు. విద్యార్థికి ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం నుంచి రూ.12 వేలు స్కాలర్‌షిప్ లభిస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు నాగప్రభ, పాఠశాల కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు పల్లపు విజయ్‌కుమార్‌ను అభినందించారు.

త్యాగనిరతికి ప్రతీక ‘బక్రీద్’

- నేడే బక్రీద్
- ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు

రాజంపేట టౌన్/రాయచోటి టౌన్ : త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను శనివారం ఘనంగా జరుపుకునేందుకు ముస్లింలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం జిల్‌హిజ మాసంలోని (చంద్రోదయం ఆధారంగా) పదవ రోజు బక్రీద్ పండుగను జరుపుకుంటారు. అల్లాహ్ కోసం పూర్వ ప్రవక్త హజరత్ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణాన్ని త్యాగం చేసేందుకు సిద్ధపడి దైవ పరీక్షలో నెగ్గిన సందర్భాన్ని పురస్కరించుకొని ముస్లింలు బక్రీద్‌ను త్యాగ దినంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి బంధుమిత్రులను కలిసి శుభాకాంక్షలు చెబుతారు. రంజాన్ సందర్భంగా దానాలు చేసే ముస్లింలు బక్రీద్ రోజున ఖుర్బానీ ఇస్తారు.

బక్రీద్ నేపథ్యం..

ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో తన కుమారుడిని త్యాగం చేయాలని దైవ ఆదేశించడంతో హజ్రత్ దైవ విశ్వాసి కావడంతో ఇస్మాయిల్ నిస్సంకోచంగా అందుకు అంగీరించి ప్రాణత్యాగానికి సిద్ధమవుతాడు. దైవానుగ్రహం కోసం కుమారుడిని సైతం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన ప్రవక్త త్యాగనిరతిని, దైవంపై ఉన్న అచంచల విశ్వాసానికి అల్లా ప్రసన్నమవుతారు. కుమారుడిని



బక్రీద్ పండుగ చిహ్నం

ఖుర్బానీ ఇచ్చే సమయంలో స్వర్గం నుంచి ఓ గొర్రెను తెచ్చి ఆ ప్రదేశంలో ఉంచుతారు. దీంతో అల్లా ఆదేశం ప్రకారం ఖుర్బానీ సంపూర్ణమవుతుంది. ఈ చారిత్రక ఘటన నేపథ్యంలో మహా ప్రవక్త హజ్రత్ మహమ్మద్ నిర్దేశం మేరకు ముస్లింలు ప్రతి ఏటా బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారు.

ఖుర్బానీ

బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలు చేస్తారు. ఒక భాగాన్ని పేదలకు, రెండవ భాగాన్ని బంధు, మిత్రులకు, మూడవ భాగాన్ని తమకోసం ఉంచుకుంటారు. ఇందులో ఏమాత్రం వ్యత్యాసం రాకూడదు.

హజ్‌యాత్రకు ప్రాముఖ్యత

ఇస్లాం ప్రాథమిక ఐదు సూత్రాలలో మొదటిది దేవుడు ఒక్కడే అని విశ్వసించడం, మహమ్మద్ ప్రవక్తను దైవప్రవక్తగా విశ్వసించడం. రెండవది ప్రతి ముస్లిం ఐదుపూటల నమాజ్‌ను విధిగా ఆచరించడం. మూడవది రంజాన్ మాసంలో ముప్పై రోజులు ఉపవాసం ఉండటం. నాల్గవది ధనవంతులు తమ సంపదలో రెండున్నర శాతం రంజాన్ మాసంలో పేదలకు, అనాథలకు, వితంతువులకు జకాత్ ఇవ్వడం. ఐదవది మక్కా యాత్ర చేయడం. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేస్తారు. ఈ మాసంలో పవిత్ర స్థలం మక్కాను సందర్శించడాన్ని ముస్లింలు పుణ్యంగా భావిస్తారు. సౌదీ అరేబియాలోని మక్కాకు వెళ్లి మజీద్ అల్ హరమ్‌లోని ఖాబా చుట్టూ ఏడుమార్లు ప్రదక్షిణ చేస్తారు.

త్యాగాల పండుగ



బక్రీద్ పండుగ మనిషికి దైవభీతిని, త్యాగనిరతిని తెలియజేస్తుంది. అందువల్లే బక్రీద్‌ను త్యాగాల పండుగ అంటారు. ధనవంతులు కచ్చితంగా ఖుర్బానీ ఇవ్వాలి. అలాగే ఆర్థిక స్తోమతగల వారు పవిత్రమైన మక్కాను సందర్శించాలి. – మౌలానా అతా ఉల్లాహ్, ఇమామ్, రాజంపేట

కార్మిక ద్రోహి కూటమి ప్రభుత్వం

- మహిళలకు రాత్రిపూట విధులు దుర్మార్గం
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డ సీఐటీయూ నాయకుడు రామాంజులు

రాయచోటి జగదాంబ సెంటర్ : ఈ నెల 4వ తేదీన జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో సంపద సృష్టికర్తలైన శ్రామికవర్గానికి పని గంటలు పెంచుతూ కార్మిక ద్రోహిగా కూటమి ప్రభుత్వం నిలిచిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కట్టు బానిసలుగా చేయాలన్న ఆలోచనను తిప్పి కొట్టానికి 11 కేంద్ర కార్మిక సంఘాలు జులై 9న సమ్మె చేయాలని నిర్ణయించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేయాలని నిర్దేశించిందని కానీ తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాలు కార్మిక వ్యతిరేక చట్టాలు అనుమతించకపోగా ఎన్డీఏ కూటమిలో ఉన్న ఏపీ సర్కార్ ఒకడుగు ముందు వేసి పని గంటలు, మహిళలకు రాత్రిపూట విధులు ఇవ్వడం అనేది కార్మికుల ఉద్యోగుల ఓట్లతో గెలిచి గద్దెనెక్కి వారికి వెన్నుపోటు పొడవడం అన్యాయం అని తెలిపారు. పనిగంటలు పెంచి జీతాలు పెంచకపోవడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాధవయ్య, ఓబులేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ రాజీనామా చేయాలి

రాజంపేట టౌన్ : తప్పుడు మూల్యాంకనంతో టెన్త్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జుబేద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మందికి పైగా టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాశారని అందులో 66,363 మంది విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 11వేల మందికి పైగా విద్యార్థుల మార్కుల్లో తేడాలు వచ్చాయన్నారు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన మోక్షిత అనే విద్యార్థినికి సోషల్‌లో తొలుత 21 మార్కులు రాగా రీ వాల్యుయేషన్ తరువాత 84 మార్కులు వచ్చాయన్నారు. ఇలా అన్ని జిల్లాల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు మార్కుల్లో తేడాలు వచ్చాయని తెలిపారు. తొలుత తక్కువ మార్కులు రావడంతో ప్రతిభ గల విద్యార్థులు ఎంతో వేదనకు గురయ్యారన్నారు. అలాగే తొలుత ఫెయిల్ అయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉండిందని తెలిపారు. మూల్యాంకనంలో జరిగిన అవకతవకలకు నారా లోకేష్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ప్రతినిధులు శివకుమార్‌రాజు, బాలిరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, సాయి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

పెనగలూరు : మండలంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని విద్యుత్ ఏడీ మురళీధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగమున ఉన్న డ్రమ్ము ట్రాన్స్‌ఫార్మర్‌ను వారు పరిశీలించారు. ఈ డ్రమ్ము ద్వారా విద్యుత్ సరఫరా అయ్యే గృహాలు అధికంగా ఉన్నాయని అందువల్ల డ్రమ్ము ఫ్యూజులు నిలబడడం లేదని వీధుల్లోని ప్రజలు ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే ఈ డ్రమ్ము స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై ఎంపీడీఓ కార్యాలయ ప్రహరీ గోడ వెనుక వైపున దిమ్మె కూడా కట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనా విద్యుత్ లైన్లు మంజూరు కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఇందువల్ల డ్రమ్ములో మధ్యాహ్నం, రాత్రి వేళల్లో విద్యుత్ వాడకం అధికం కావడంతో ఫ్యూజులు అధికంగా పోతున్నాయని ప్రజలు ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఏడీ డ్రమ్ము స్థానంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించి విద్యుత్ సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ చిన్న, సచివాలయ లైన్‌మెన్ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాన్షికి వైఎస్సార్‌సీపీ నాయకుల ఘననివాళి

ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో చిన్నమండెం మండలం వండాడికి చెందిన దివ్యాన్షి(14) మృతిచెందింది. బాలిక మృతదేహాన్ని వారి స్వగృహానికి తీసుకువచ్చారు. దివ్యాన్షి మృతదేహాన్ని శుక్రవారం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాలిక మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుటుంబాన్ని దేవనాథరెడ్డి ఓదార్చారు. దివ్యాన్షి మృతి పట్ల వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముసల్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, బయారెడ్డి, శివారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



దివ్యాన్షి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి

పది ఫలితాల్లో రాణించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



బుచ్చిరెడ్డి ప్రణవి | రాటకొండ ప్రణవి

పెనగలూరు : మండలంలోని చక్రంపేటలో ఉన్న సాయి వికాస్ హైస్కూల్ విద్యార్థులకు ఇద్దరు బుచ్చిరెడ్డి ప్రణవికి (580), రాటకొండ ప్రణవి (578) మార్కులు రావడంతో ప్రతిభా అవార్డులు దక్కినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, తిరుమల రెడ్డిలు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు మండలంలో మంచి మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సుండుపల్లె : పదవ తరగతి 2024 – 25 బ్యాచ్ విద్యార్థులకు ఇవ్వబోతున్న ప్రతిభా అవార్డుల్లో సుండుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు అవార్డుకు ఎంపికయ్యారు. అందులో శ్రీధర్, సత్యకుమారి, రాజు, గాయత్రిలు అవార్డుకు ఎంపికయ్యారని చెప్పారు. ప్రతి మండలానికి ఆరు ప్రతిభా అవార్డులు ఇవ్వనుండగా అందులో నలుగురు సుండుపల్లె విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు షాకీరాబేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి అవార్డులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

లక్కిరెడ్డిపల్లి : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదు మంది విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికై నట్లు మండల ఎంఈఓ చక్రేనాయక్ పేర్కొన్నారు. సోమవారం 9వ తేదీన అన్నమయ్య జిల్లా రాయచోటిలో ప్రతిభా అవార్డులు ఎంపికైన వారికి కలెక్టర్ చేతులమీదుగా ప్రదానం చేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. షేక్ అర్షియా, ఆవులకుంట కిషోర్ బాబు, చొన్నకొండ తానీష్, ఉడుము షణ్ముఖ రాయల్, సంకల సాల్మన్ రాజ్‌లు అవార్డులకు ఎంపికయ్యారన్నారు.



జోస్నిత | మస్తాన్

చిట్వేలి : స్థానిక శ్రీ సాయి వికాస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టి.రెడ్డయ్య, ప్రధానోపాధ్యాయులు షాజీ, భాస్కర్‌లు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పది పరీక్షలలో యు.జోస్నిత (593), షేక్ మస్తాన్ (590), బి.ప్రవీణ (580), ఆర్ ప్రవీణ(578), జె.లిఖిత (554) మార్కులు సాధించినందుకు ప్రభుత్వం విద్యార్థులకు అవార్డులను అందించడం హర్షనీయమన్నారు.

నేటి నుంచి నాగారపమ్మ జాతర



సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండ కాడ ఈడిగపల్లె గ్రామంలో వెలసిన నాగారపమ్మ జాతరను శనివారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరునాల సందర్భంగా శనివారం, ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సోమవారం రోజున ఉదయాన్నే పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు తెలియజేశారు. తదనంతరం అభిషేకములు, బోనాలు, రాత్రికి విద్యుత్ దీపాలంకరణలతో, మేళతాళములతో, చెక్కభజనలతో చాందినీ బండ్ల ప్రదక్షిణలతో నిండు తిరునాల జరుపుతున్నట్లు వారు తెలిపారు. భక్తులు ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని జాతరను తిలకించవలసిందిగా వారు కోరారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

లక్కిరెడ్డిపల్లి : పాఠశాలలో వంట నిర్వహణపై జాగ్రత్తలు తీసుకొని నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సభా భవనంలో శుక్రవారం పీఎం పోషణ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి సంబంధించి మండల స్థాయి వంట ఏజెన్సీలకు శిక్షణా కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి–2 వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాల్సిన మెనూను తెలియజేసి, వంట తయారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వంట ఏజెన్సీ వారికి మండలస్థాయి వంట పోటీలు నిర్వహించారు. ఈ వంట పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, ఎంఈఓ–2 వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, సిఆర్పీలు రామ్మోహన్, శశికళ, చంద్రకళ, మల్లికార్జున, వంట ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు తిలోధకాలు ఇచ్చి దోపిడీ చేస్తున్నాయని అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎంఈఓ సుందర్‌బాబు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, మండల కార్యదర్శి లతీఫ్‌లు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా యాజమాన్యాలు పాఠశాలలను నడుపుతున్నారని తెలిపారు. పలు కార్పొరేట్, ప్రవేటు విద్యాసంస్థలు వేసవిసెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని తెలియజేశారు. పాఠశాలలు ఒలంపియాడ్, సైనిక్, టెక్నో, ఇ–టెక్నో, ఐఐటీ కాన్సెప్ట్ వంటి పేర్లతో ప్రచారాలు చేస్తూ అధిక ఫీజులు కఠినతరంగా తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బేపారి మహమ్మద్ ఖాన్

రాయచోటి టౌన్ : నేడు బక్రీద్ పండుగ సందర్భంగా పాత రాయచోటిలోని హజరత్ జమాలుల్లా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తారు. ఈ ఈద్గా ప్రదేశాన్ని అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గాను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈద్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్ ఖాన్ శుక్రవారం కమిటీ సభ్యులతో కలసి పరిశీలించారు. జరుగుతున్న పనులను పరిశీలించిన తరువాత పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 7:30 గంటలకు ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్నట్టు సర్కాజీ షార్ఫుద్దీన్ హుసైనీ తెలిపినట్లు చెప్పారు. ప్రార్థనకు వచ్చే వారి కోసం నీరు, గ్లూకోజ్ నీరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నా సలీం, బేపారి జబివుల్లా, బేపారి అసద్ ఖాన్, షావలీ, ముజాఫర్ అలీఖాన్, ఫైజల్ ఖలీల్ బేగ్, షఫీ హాఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఉపాధి కరువు



మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి జగదాంబ సెంటర్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో యువతకు ఉపాధి కరువైందని వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ ఆరోపించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలో మేము ఇది చేశారో చెప్పుకునే పరిస్థితిలో కూటమి నేతలు లేరన్నారు. 2.50 లక్షల వాలంటీర్లకు, 25 వేల మంది మద్యం షాపుల సిబ్బందికి, 15 వేల విలేజ్ క్లినిక్‌లలో పని చేసే వారు ఉద్యోగులను రోడ్డు పడేసేలా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అంతటితో ఆగిపోకుండా 15 వేల మంది రేషన్ డోర్ డెలివరీ సిబ్బందిని తొలగించడమే కాక 5 వేల మంది ఫైబర్‌నెట్ సిబ్బందికి ఉపాధి, 20 వేల ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు తమ ఉపాధికి దూరం అయ్యారని పేర్కొన్నారు. ఇలా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు తీసేసి రాష్ట్రంలో నిరుద్యోగులను మరింత పెంచి యువతకు కడుపుకోత మిగిల్చారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వివాహం జరిపించిన ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, అమరజ్యోతి దంపతులు వధూవరులకు ఉచితంగా వివాహం జరిపించి ఆశ్వీరదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని దేవాలయముల సముదాయంలో శుక్రవారం ఒంటిమిట్ట మండలంలోని చింతరాసపల్లి గ్రామానికి చెందిన చిన్న కదిరయ్య, వెంకటమ్మల కుమారుడు నరసింహులుకు, అదే గ్రామానికి చెందిన కదిరి లక్ష్మీదేవి కుమార్తె ఆదిలక్ష్మికి దగ్గరుండి ఎమ్మెల్యే ఆకేపాటి వివాహం జరిపించారు. ముందుగా నూతన వధూవరులకు చీరె, సారె, నూతన వస్త్రాలు, తాళిబొట్టు అందజేశారు. అనంతరం వారికి వివాహం జరిపించి ఆశ్వీరదించారు. అదే విధంగా వివాహానికి విచ్చేసిన బంధువులకు ఎమ్మెల్యే ఆకేపాటి స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అనంతరం ఆయన మండల పరిధిలోని ఊటుకూరు గ్రామం సున్నపురాళ్లపల్లెలో శ్రీకామాక్షి సమేత భవాని శంకరస్వామి, శ్రీగణపతి స్వామి, శ్రీ సుబ్రమణ్యస్వామి, నందీశ్వరస్వామిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆకేపాటి పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు.



వధూవరులకు చీరె, సారె అందిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు

పీఎం సూర్యఘర్ పథకం ఉపయోగకరం

నందలూరు : పీఎం సూర్యఘర్–ముఫ్త్ బిజిలీ యోజన పథకం ఎంతో ఉపయోగకరమని ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ పథకంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ పథకం ఆన్‌లైన్ దరఖాస్తు నేషనల్ పోర్టల్‌లో సమర్పించవచ్చని అన్నారు. గృహాలకు తగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట కెపాసిటీ, సబ్సిడీతో పొందవచ్చని తెలిపారు. ఈ పథకం ఏర్పాటు చేసుకుంటే సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 125 యూనిట్లు ఉత్పత్తి చేస్తుంది కాబట్టి వినియోగదారులు డిస్కౌంట్ నుంచి కనీస విద్యుత్ బిల్లులు మాత్రమే చెల్లించవలసి వస్తుందని తెలిపారు. ప్యానెళ్లు సూర్యుని వేడిని పీల్చుకోవడం వల్ల ఇళ్లు చల్లగా ఉంటాయని తెలిపారు. వినియోగదారుడు 5 నుంచి 6 సంవత్సరాలలోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలి

రాయచోటి టౌన్ : సమాజంలో ప్రజలు అందరూ హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ గడికోట చెన్నారెడ్డి కోరారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రూప్ సమావేశంలో మాట్లాడారు. ఎయిడ్స్ బాధితుల పట్ల చిన్న చూపు చూడరాదన్నారు. సమాజంలో వారికి గుర్తింపు ఇవ్వాలని సూచించారు. అలాగే సెక్స్‌వర్కర్లు, ట్రాన్స్‌జెండర్‌ల హక్కులు వివరించి చెప్పాలన్నారు. అనంతరం న్యాయవాదులు రామాంజనేయులు, మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ బాల్యవివాహాలను నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే మైనర్ బాలికలతో వ్యభిచారం నిర్వహించడం, ప్రోత్సహించడం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. మేజర్ అయిన వార సహజీవనం చేయడం నేరం కాదన్నారు. కార్యక్రమంలో పీసీఎస్ఎస్ మేనేజర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ సమ్మర్ క్యాంపు

వీరబల్లి : వేసవి సెలవుల్లో చిన్నారులు చదువు నుంచి దూరం అవ్వకుండా గ్రంథాలయాల్లో నిర్వహించిన శిక్షణా శిబిరాలు ఉపయోగపడ్డాయని ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి, పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజులతో పాటు విద్యార్థులకు నీతికథలు, ఆటల పోటీలు, ఇంగ్లిష్ గ్రామర్ శిక్షణ అందించడం పట్ల గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మిని అభినందించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వార్డు మెంబర్ ప్రసాద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈఓపీఆర్‌డీ

వైభవోపేతంగా విగ్రహ ప్రతిష్ట, కల్యాణోత్సవం

సిద్దవటం : మండల కేంద్రం పరిధి దిగువపేటలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వేద పండితులు వెంకటరంగయ్య స్వామి మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయాన్ని స్థానికులు విశ్రాంతి ఏఈ సుబ్రమణ్యం, వెంకట రత్నంలు రూ. 7లక్షలు సమకూర్చి ఆలయానికి మరమ్మతులు చేయించి, అభివృద్ధి చేశారన్నారు. దీంతో ఆలయంలో సీతా,రామ,లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్టతో పాటు ఆలయంలో వినాయక స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠంచామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయా, కర్పూరాలను సమరించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ పునః నిర్మాణం కోసం కృషి చేసిన సుబ్రమణ్యం, వెంకట రత్నం లను మాజీ సర్పంచ్ శాదా సుబ్బరాయుడు కుమారులు సురేష్‌బాబు, మహేష్‌బాబులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.



కల్యాణ వేడుకను జరుపుతున్న వేదపండితులు

శీతల గంగమ్మకు విశేష పూజలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున గ్రామ దేవతకు మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి గుడిపై 101 బిందెలతో నీళ్లు పోశారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, పుణ్యహావాచనం, అమ్మవారికి కుంకుమార్చన, హోమం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతర వచ్చిన భక్తులు అమ్మవారి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొని, కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.



అమ్మవారిని దర్శనానికి బారులుతీరిన భక్తులు